



సెకండు అనే అతి సున్నితమైన కొలతకి ... చేతనత్వం కల్గి... నిముషాలను నిర్విరామంగా సృష్టిస్తోంది.

ఆ నిముషాలు నిర్విచారంగా పుట్టుక వస్తూ రాజారావు చేతి గడియారంలో... గంటల్ని మారుస్తున్నాయి.

అతను బాల్కనీ పిట్టగోడ మీద చేతులానించి ... బయట రోడ్డు మీదకు చూస్తున్నాడు.

చీకటిపడి చాలా సేపైంది. బయట బజార్లో...దీపాల వెలుతురు రాజారావు బంగళా ఆవరణలోకి దూ రా ల నే ప్రయత్నంచేస్తూంటే...కింద తోటమాలి

ఎదురొడ్డి పోరాటం సాగిస్తున్నాయి

ఏమైనా సరె...! ఈ రాత్రి... లతని హత్యచేసే తీరాలి...!" గడిచి పోయిన రెండుగంటల సమయంలో ఈ వాక్యాన్ని పదవసారి మననం చేసు కుంటూ...కాలం కల్పించిన వ్యవధిలో చెదిరిపోతున్న పట్టుదలని...ధృవీకరింప జేసుకొంటున్నాడు.

మానసికంగా అతను నిస్సత్తువగా వున్నాడు. అయినా అతని హృద యంలో...అంతకు మించిన కసి...!

అంతరంగంలోని ద్వేషానికి ...... ఉనికిని కల్పిస్తున్నట్లుగా...కళ్లు రక్త వర్ణం దాల్చివున్నాయ్.

చాలా సేపట్నుంచి నిలబడిన అతని కాళ్ళలో ... అలసట... ! వెనుదిరిగి వచ్చాడు.

సోఫాలో జారగిలబడి సిగరెట్ ముట్టించాడు. గుప్పుమని బయటకు వదలబడిన....సిగరెట్ పొగ... ! ఆ పొగలో ... అతని అంతరంగంలోని ఆవేదన...సుళ్ళు తిరుగుతూ...

అతను మళ్ళీ బయటకు చూస్తు న్నాడు – 'కేరు' మని అరుస్తూ... రోడ్డుమీద ఆగిన స్కూటర్ చప్పుడు !

ఇంకా ప్రేమికుల స్థాయి వీడని... కొత్త దంపతుల జంట ఒకటి... స్కూటర్ దిగిపోయి...చెట్టాపట్టాలేసు కుంటూ.... ఇంట్లోకి వెళ్ళిపోతున్నారు.

పోయి నడుస్తోంది అతను ఆమె చెవిలో గుసగుసలు చెబుతున్నాడు. రాజారావు దృష్టి మరల్చాడు చిన్న నిట్టూర్పుతో.

వాచీవంక చూసుకున్నాడోసారి...! తొమ్మిది కొట్టానికి ... మరో ఐదు నిముషాలు కావాలి. అందరూ ఇంటికి చేరుకుంటున్నారు...

కాని ... లత యింకా రాలేదు.

"అవును...యింకా రాలేదేమిటి ?"– అసహనంతో మస్తిష్కంలో మెదిలిన ప్రశ్నను...చివరికంటా కాలిపోయి, వేలి చివర్లనుచురుక్కు మన్పించిన సిగరెట్ ...మరోదారి తొక్కించింది.

చిరాకుగా క్రింద పడేసి ... కాలి చెప్పుతో నలిపేసాడు. నలిగిన సిగరెట్ తన జీవితానికి దర్పణంలాగా కనిపి స్తుంటే...చూపులు తిప్పి, తిరిగి ప్రశ్న వేసుకొన్నాడు.

లత ఇంకా రాలేదేం... ? ఇంత రాత్రిదాకా...బయటేం చేస్తూంది... ?

సినిమాకు వెళ్ళిందేమో... !

అవును ..సినిమాకే వెళ్ళుంటుంది.

ఒంటరిగానా...? ఊహుఁ! కాదు... జంటగా...సుకుమార్‌తో... సుకుమార్ స్కూటర్ మీద...! వెనకాల కూర్చుని అతని నడుంచుట్టూ చెయ్యేసి... !!

కుర్చీలో అటూ ఇటూ కదలిన అతనిలో...అసహనం.

మనసును......ఎవరో అజ్ఞాతంగా

మెరమెర.

'అయితే ఇక లత పదిన్నరగ్గానీ... ఇల్లు చేరదు. అంటే...తను మరో గంటన్నర కాలం వెయిట్ చెయ్యాలి !

మరో గంటన్నర...' తొంభై నిము షాలు... ! ఓపిగ్గా కాచుకోవాలి. ఆ తర్వాత ... ??

లత వొస్తుంది మొదటి ఆట సినిమా నుంచి...

ఆమె భోంచెయ్యటానికి మరో పావు గంట... ! అంతే...ఆ తర్వాత దొరుకుతుంది అవకాశం. పడుకోవటానికి ఆమె తన గదిలోకి వెళుతుంది. తనూ ఆమె వెనకాలే అనుసరించి...

హత్య... ! ఈ రాత్రి తనో హత్య చేసి ... హంతకుడు కాబోతున్నాడు. హత్య మరెవర్నో కాదు. తనకి ప్రియాతి ప్రియమైన లతని...!

తను...తనామెను చంపగలడా...?

లతని తను ప్రేమించాడు. గాఢంగా ప్రేమించాడు. అంతకన్నా యెక్కువగా ఆరాధించాడు. తన హృదయంలో లతకో ఔన్నత్యాన్ని ఆపాదించాడు.

కాని...లత...హుఁ ... కృతఘ్ను రాలు.

ఇంతకాలం, తన తోటిదే లోకమను కొన్న లత - తన్నసలు ప్రేమించనే లేదంటుందా... ?

ఆడది ఎంతకైనా తగునేమో ...! నిశ్చింతగా కాలంగడుపుతూ ... సుకుమార్‌తో ప్రణయంసాగిస్తోంది.

ఆలోచనల నుండి బాహ్యంలోకి వచ్చాడు రాజారావు.

వాచీ చూసుకున్నాడు –

టైము పావుగంట కూడా ముందుకి జరుగలేదు

సిగరెట్ వెలిగించాడు. దమ్ములాగి బయటకు వదిలాడు పొగ. సిగరెట్ పొగలో...రాజారావు.

రాజారావు మనసులో ... తిరిగి ఆలోచనలు... !

ఆ ఆలోచనలు పరుగులు తీస్తూ... గతంలోకి... !

* * *

ఓ రోజు సాయంకాలం –

లతా...తనూ...కారు దిగి చెట్టాపట్టా లేసుకొంటూ సముద్రతీరాన ఇసుకతో నడుస్తున్నారు.

తన గుప్పిట్లో...లత సుకుమార మైన చెయ్యి.

ఓ చోట ... ఇసుకతిన్నె మీద ... ఇరువురూ కూర్చున్నారు. దగ్గరగా... మరింత దగ్గరగా...

ప్రకృతిమీద సంధ్యాదేవి...తన నీలి ముసుగును సుతారంగా కప్పుతోంది.

తన వొడిలో లత... ! స్తంభానికి చుట్టుకొన్న లతలా తన మెడచుట్టూ లత చేతులు.

తను మత్తుగా చూస్తున్నాడు ఆమె కళ్ళలోకి. సిలికళ్ళకి కాటుక. కంటి పాపల్ని ఆశ్రయించుకొన్న కోరికలు. పిల్లగాలికి కదులుతున్న ఆమె ముంగురులు.

ఆ ముంగురుల్ని సవరిస్తూ...కళ్ల లోని కోరికలకి...అర్థాలు వెతుక్కొం టున్నా హృదయంలో ... యేదో పులకింత.

"ఏమిటి బావా...! చూపుల్లో చలనం లేకుండా బొమ్మలా వుండిపోయావు...?" – ఆమె ప్రశ్న.

"ఇదా...ఇది మైమరపు..." తన సమాధానం.

కిలకిల నవ్వింది లత.

అలల వొరవడిలో కలిసిపోయిం ఆమె నవ్వు.

ఆమె ముఖంలోకి చూసాడు తను.

కళ్ళు ... చెక్కిళ్ళు ... అధరాలు! తన చూపుల్ని జాగృతం చేశాయి.

తన హృదయంలో ఏదో కోరిక...! శరీరం ఏదో అనుభవానికై చేసిన ప్రేరేపణ.

చిన్నగా...లత ముఖం మీదుగా వొంగి... ఆ అనుభవాన్ని అందుకొన్నాడు.

లత వదనంలో సిగ్గు. చప్పున తన హృదయంలో తలదాచుకొంటూ అంది –

"ఈ రోజు నీ ప్రవర్తన వింతగా వుంది బావా... !"

"అవును లతా! ఈ రోజు నువ్వెప్పుడూ లేనంత అందంగా వున్నావు. అందుకే నా మనసు కొత్త పంథాలో పరవళ్ళు తొక్కుతోంది–" ఆమె చెక్కిళ్ళు మృదువుగా స్పృశిస్తూ తను.

లత మందహాసం చేసింది.

తనూ నవ్వాడు చిన్నగా. లత వేపు చూస్తున్నాడు తను. లత సముద్రంకేసి చూస్తోంది. పరిసరాలు గుర్తుంచు కోవటం మర్చిపోయారు ఇరువురూ.

"లతా!"

ఆమె తనకేసి చూసింది. తనలో ఏదో ఉద్రేకం.

"ఈ రోజు నిన్ను చూస్తుంటే... ఇప్పుడిక్కడే నీలో ఐక్యంకావా లనుంది –"

లత కాటుకకళ్ళు రెప్పలార్పకుండా నిల్చిపోయాయి. ఆ చూపుల్లో కోటి భావాలు.

"బావా!" కంఠంలో యేదో ఆర్తి.

"ఏమిటి లతా...!"

"త్వరగా...చాలా త్వరగా...నన్ను నీదాన్ని చేసుకో బావా..." ఆమెలో ఉద్వేగానికి ... చిన్నగా నవ్వాడు.

– "అంత వేగిరపాటేం లతా! నా మరదలు ... నా అర్ధాంగి కాకుండా పోతుందా...?"

"కాని..." మాట పూర్తిచేయలేక పోయింది. ఆమె భావాల్ని మాటల్లో

కానుండా ... కళ్లల్లో ... ముఖంలోనూ వ్యక్తంచేసింది లత.

తను అర్థంచేసుకొన్నాడు. 'ఎంత కాలం ఈ అనుభూతులకి...నిగ్రహం అనే కళ్ళెం తగిలించి వుంచటం...?'

సమాధానంగా ... ఆమె ముఖాన్ని తన గుండెలకి హత్తుకున్నాడు చుట్టూ చీకటి తెరలు వ్యాపించాయి.

"ఇక వెళ్దాం - " మృదువుగా తన నుండి విడివడి లేచి నుంచుంది.

— తనూ బయలుదేరాడు.

* * *

ఇలాంటి సమావేశాలెన్నో తమ ఇరువురి హృదయాల మీద చెరగని ముద్రవేసాయి.

చెరగవని అనుకొన్న ముద్రల్ని... చెరిపేసుకొని, తిరుగుతోంది లత ఇప్పుడు... !

కాని తనకు అవి మాయని గాయాలై బాధపెడుతున్నాయి.

ఆఖరైన సిగరెట్‌ని విసిరేసి... బాధగా కళ్లుమూసుకొన్నాడు రాజారావు. మూసిన కనురెప్పల వెనుక...చీకటి వలయాలు ఆ వెనగ్గా...మళ్ళీ.. గతం.

* * *

రెండు రోజుల క్రితం-

సాయంకాలం...తను సముద్ర తీరానికి బయల్దేరుతూ...లతను ఆహ్వానించాడు.

అప్పటికే తనూ తయారై బయటకు వెళ్ళబోతున్న లత ఆగి—"ఎక్కడికి ?" అంది.

"అలా బీచికి వెడదాం..." ఎంతో మృదువుగా...తను

"ఇప్పుడా... ? ఇప్పుడు, బీచి కెందుకు... ?"

"నీతో కొంచెం మాట్లాడాలి లతా !"

లత కనుబొమలు ముడిచింది— "అదేదో...ఇక్కడ మాట్లాడండి. నాకు వేరే పనుంది-" అంది తిరస్కారంగా.

తన మనసు కలతపడింది. ఆవేదనతో పాటు ఆమె మీద చెప్ప లేనత ఆగ్రహం పెల్లుబికింది. తమా యించుకొని-

"ప్లీజ్...లతా...! నీతో ముఖ్యమైన సంగతి చెప్పాలి" అన్నాడు మార్ద వంగా...కొంచెం వేడుకోలుగా.

లత ఏమనుకొందో...ముఖం కొంచెం ప్రశాంతంగా పెట్టింది.- "అలాగే...! మీరు వెళ్ళండి నేను... సుకుమార్‌తో సినిమాకు వెళుతున్నాను. మధ్యలో మిమ్మల్ని కలిసి వెళతాను-"

లత మెట్లు దిగి వెళ్ళిపోయింది.

తను కొద్ది క్షణాలు...కలలోలా ఆమె వెళ్ళిన దిశ చూస్తుండి పోయాడు. తర్వాత...ఉదాసీనంగా నిట్టూర్చుతూ.. గారేజికేసి...నడిచాడు కారుకోసం.

రాజారావు ఇసుకలో కూర్చున్నాడు- ఎదురుగా సముద్రం.

యంలో అశాంతి ఉరవడి.

దూరంగా...రోడ్డుపైన వాహనాల చప్పుడు.

పక్కన కొద్దిదూరంలో...పిల్లల కేరింతలు...!

"లత వస్తుందో రాదో...? ఆమె తనతో కల్సి రాకపోవటానికి కారణమేమిటి...? తనమీద ఇంత కొద్ది వ్యవధిలో...అంతగా అసహ్యాన్ని లా పెంచుకొంది...? ఆమె...ద్వేషానికి కారణం...సుకుమారా...??

తనతో ప్రేమను తెంచుకొంటే పోయె కనీసం, మాట్లాడ్డాని క్కూడా...తిరస్కారమా...?

ఒకవేళ సుకుమార్ చెప్పలేదు కదా...లతని తనతో తిరగొద్దని...?

—తను ఆపివచ్చిన కారు పక్కనే స్కూటరొకటి వచ్చి ఆగింది-

దానిమీద...సుకుమార్...లతలు !

రాజారావు హృదయం బాధతో మూల్గింది.

"ఓ...కే...లతా...! నేనలా తిరిగి మరో గంటకల్లా వస్తాను. ఆయన్తో మాటలేవిటో త్వరగా ముగించు-" అనేసి...కొద్దిదూరంలో కూర్చుని వున్న తనకేసి అదోలా చూసి... స్కూటరెక్కి వెళ్ళిపోయాడు సుకుమార్.

వస్తోంది లత.

తనలో ఏదో తెలీని...ఉద్వేగం... ఉప్పెనలా పొంగింది.

రెండు క్షణాలు...రెప్పలార్పకుండా ఆమెవేపు చూసాడు. అద్భుత సౌందర్యానికి నిర్వచనం గోచరించినట్లయింది.

కోల మొహంలో కాటుక తీర్చిన... నీలి కళ్లు...!ఎర్రని పెదాలు...మృదుత్వానికి ప్రతీకలుగా.

ఒక పక్కకి కొద్దిగా జారిపోయిన పమిట...బయల్పరిచిన అందం... కళ్ళలోకాంతికిరణమై గుచ్చుకొంటోంది.

ఎత్తయిన గుండెల్ని పరామర్శిస్తూ.. మెడలో ఒంటిపేట గొలుసు కుడిచేతికి బ్లాక్‌డయిల్ రిస్టువాచ్. ఎడం చేతికి రెండే రెండు గాజులు......

చాక్‌లెట్ కలర్ చీర...అందంగా మలచుకొన్న ఆకారం.


అంత అందమైన స్త్రీని...ఈ లోకంలోకి ప్రవేశపెడ్తూ...తనకి మరదలుగా నిర్దేశించిన సృష్టికర్తను మనసులోనే అభినందించుకొన్నాడు తను.

ఎదురుగా...చాలా దగ్గిరగాలత...!

ఆమెనే తదేకంగా చూస్తున్న తనకేసి...నిర్లక్ష్యమైన చూపొకటి విసిరి ముఖం చిట్లించుకొంది.

తమాయించుకొని—"లతా !" అని పిల్చాడు చాలా మృదువుగా.

తనకి కొద్దిదూరంలో కూర్చొంటూ-



"ఏమిటో...ఈ రోజు బీచికి ఆహ్వానించారు...?" అన్నది.

ఆమె కంఠంలో ఎలాంటి మృదుత్వం లేదు. మాటల్లో...లీలా మాత్రంగా కదలిన వ్యంగ్యం. తను గుర్తించాడు.

"బీచీ మనకు కొత్తేమిటి లతా...! నిన్ను ఆహ్వానించటానికి? ఇదివరలో మనం ఎన్నిసార్లు రాలేదు..."

తల తిప్పుకొంది లత. మళ్ళా అదే తిరస్కారం.

"ఇదివరకటి సంగతి అనవసరం..! ముందు నన్నిక్కడ కెందుకు రమ్మన్నారో చెప్పండి—"

"నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి లతా!"

"ఏమిటా ముఖ్యమైన విషయం..?"

కాస్సేపు నిశ్శబ్దం. తనలో తనకి తెలీకుండానే ఏదో ఆరాటం. ఆ వెనుకనే...మళ్ళీ ఏదో నిర్లిప్తత...!

"నీ పెళ్ళి సంగతి మాట్లాడా లనుకొంటున్నాను లతా...!"

ఆమె ... కొద్దిగా తల తిప్పి

చూసింది. కళ్ళలో ఆశ్చర్యం లాంటిది చోటుచేసుకొంది.

తను తిరిగి అన్నాడు-"నీ కింకా పెళ్లి అవలేదు. అలా కాకుండా...నువ్వా సుకుమార్‌తో తిరగటం...మంచిది కాదేమో ఆలోచించు లతా...!"

లత నవ్వింది గలగలమంటూ. ఆ నవ్వులో వెటకారం...-"నేను సుకుమార్‌తో తిరగటం...మీ కిష్టం లేదన్నమాట..."

"ఊహుఁ..."

"ఐతే...తిరక్కూడదన్నమాట..."

"అవును లతా...'తిరక్కూడద-"

మళ్ళీ నవ్వింది లత అదోలా.

ఆ నవ్వు...గుండెల్ని గాయపర్చేంత వాడిగా...

రాజారావు హృదయం...బాధతో గిలగిలలాడింది

-"చూడండి బావగారూ! నేను సుకుమార్‌తో తిరిగినంత మాత్రాన... మీ కొచ్చే నష్టమేమిటో...?"

"లతా...! అంత అవివేకంగా మాట్లాడక..."—అతను కోపం తెచ్చుకోవటానికి పూంజుకొన్నాడు. కాని లాభం లేకపోయింది. నిస్సత్తువ... మనసు మూలమూలలా ఆక్రమించింది. గుప్పిటతో ఇసుక తీసికొని ఒక చోట ధారగాపోస్తూ అన్నాడు-

"నష్టం నాక్కాదు. నీకే. కాని...నీ జీవితాన్ని గూర్చిన బాధ్యత నామీదుంది. ఆ విషయం గుర్తుంచుకో..."

"నా జీవితాన్ని గూర్చిన...ఎటువంటి బాధ్యతా...ఎవ్వరిపైనా వుంచటం నా కిష్టం లేదు-" కొంత అయిష్టతా...అంత కన్నా ఎక్కువ పట్టుదలా...మేళవించిన స్వరంతో లత అన్నది.

"కాని నువ్వు ఆడపిల్లవి. పెళ్ళి కావాల్సిన దానివి. కట్టుదిట్టాల్లో మసులుకోవాల్సిన బాధ్యత నీ మీదుంది-"

"నేనేం బాధ్యతారహితంగా ప్రవర్తించటం లేదు. ఒకవేళ ప్రవర్తించినా...ఆ బాధ్యతల్ని మోసే వ్యక్తి మాత్రం మీరు కాదు-"

ఎంతటి కటుత్వం...? ఈ వాడి బాణాలను ఎలా ప్రయోగించ గల్గుతోంది లత...? నిన్న మొన్నటి దాకా తన తోటిదే లోకమనుకొన్న లత...తను లేకపోతే జీవితమే చీకటన్న లత... ...ఇంత త్వరగా యెలా మారి పోయింది...?

అతనికి మాట్లాడాలన్నా గొంతు పెగలలేదు. ఎలాగో అన్నాడు- "అయితే-సుకుమార్‌తో తిరగటం మాత్రం ..మాననంటావ్...?"

"అవును..." స్థిరంగా లత.

"ఎంచేత...?"

"నేనతణ్ణి ప్రేమించాను కాబట్టి..."

"అయితే...?"

అతిన్తి...తిరకూ్కిడదన ప్రసక్తి లేదు-"

"సుకుమార్ని ప్రేమించావా...? ఇప్పుడు లతా...? మొన్నటి దాకా నన్ను ప్రేమించా నన్నావు...!''

రాజారావు ప్రయోగించిన వ్యంగ్య బాణం...లత అహంమీద దెబ్బతీసింది. ఆమె ముఖం ఎర్రబారింది ఆవేశంగా అంది-"నే నెవర్ని ప్రేమించింది... ఎప్పుడు ప్రేమించింది...మీరిలా రెట్టించి అడగాల్సినవసరం లేదు. మన మధ్య వున్న బంధుత్వంవల్ల మీతో చనువుగా ప్రవర్తించుండొచ్చు.అంత మాత్రానికే నా మీద ఏదోఅధికారమున్నట్లు..మీరిలా నిలదీయటం నేను సహించను-''

నిశబ్దంగా వుండిపోయాడు తను. ఓ క్షణంపాటు సముద్రం కేసి దృష్టి తిప్పాడు. అలలు ఉవ్వెత్తుగా ఎగిసి పడుతూ...ఒడ్డును అతిక్రమించాలని ముందుకి ఉరుకుతున్నాయి.

లత తనే మళ్ళీ అన్నది-"మా నాన్న గారు పోయిందగ్గర్నుంచి...నన్నూ... అమ్మనీ...ఆదరిస్తూ ..పోషిస్తున్నాననే భావం వల్ల అధికారం ప్రదర్శిస్తున్నా రేమో...! కాని తొందర్లోనే ఆ బంధం కూడా తెంచేసుకోవా లనుకొంటున్నాను. నా ఉద్యోగప్రయత్నం ఫలించగానే... అమ్మతో వేరుగా వెళ్ళిపోతాను-''

"లతా.."ఉప్పెనలా ముంచుకొచ్చిన ఆవేశాన్ని అణుచుకోలేక బిగ్గరగా అరిచాడు రాజారావు- ఎంత నిజాయితీ లేకుండా మాట్లాడుతున్నావు...? ఎదుటి మనిషికి హృదయం వుంటుందనీ...అది గాయపడ్తుందనీ యోచించవేం...?

నా మీద ప్రేమను తెంచుకొన్నావు సరె...! బాంధవ్యం కూడా తెంపేస్తావా లతా...? నేను నీకు ఉపకారినో...అప కారినో నీకు గ్రహింపులేకపోయినా... అత్తయ్యకి తెలుసు.నువ్వు...సుకుమార్ని ప్రేమించటం తప్పని నేనటం లేదు అతను నా కంటే అన్నిట్లోనూ యోగ్యుడు కూడా.కాని...పెళ్ళికిముందే మీరిలా... తిరగటం...''

"ఇష్టం లేదంటారు, అవునా...?"- చురుగ్గా చూసింది లత.-"మీ సహృదయతకు చాలా థాంక్స్ బావగారూ...! నేనూ...సుకుమారూ ప్రేమించు కొన్నది...పెళ్ళిచేసుకోవటానికే. ఇది మీకు సమ్మతమంటూనే...మరో ప్రక్క ఈర్షాసూయలు ప్రదర్శించు కొంటున్నారు.

అయినా నేను చెబుతున్నాను వినండి. పెళ్ళి కాకముందు సుకుమార్ తో తిరిగితే ...ఏదో కీడు జరుగుతుందనేంత చెడ్డ వాడు కాదతను-"

రాజారావు గుండె పగిలిపోయింది. అయిదు నిముషాలక్కానీ తేరుకోలేక పోయాడు.

"తన మనసులో దావానలం లాంటి రహస్యం దాక్కొని వుంది. ఆ

రహస్యాన్ని ఆమెకి చెప్పేసి హృదయ భారం తీర్చుకొందా మనుకొన్నాడు.

లత నుండి ప్రేమను పొందక పోయినా...తనొక దగాపడిన వ్యక్తిగా ...విధి కాటుతిన్న మనిషిగా.. సాను భూతి దొరుకుతుందని ఆశపడ్డాడు. కాని..."

లత కూర్చున్న చోటు నుంచి చటుక్కున లేచి నిలబడింది.

"నేనంటే నీ కెందు కింత అసహ్యం లతా...!"

-మనసులో ప్రశ్నలు ఎన్నో రూపా లలో ముసురుకొంటున్నా, అంతకంటె నోరు పెగల్లేదు ఆమెను ప్రశ్నించటానికి.

"అవును. మీరంటే నాకు అసహ్యమె. ఈ అసహ్యానికి కారణం మీరు నన్ను వంచించా లనుకోవటమే. ఒకప్పుడు మిమ్మల్ని నిండు మనసుతోనే ప్రేమిం చాను. ఆ మాట ఇప్పుడు వొప్పుకొంటు న్నాను.అయితే ప్రేమ గుడ్డిదనే మాటను నిజంచెయ్యాలను కొన్నారు మీరు. కదూ...!

"నా జీవితాన్నే నాశనం చేయ బోయారు. కాని ముందుగానే జాగ్రత్త పడి నేనా అపాయం లోంచి తప్పు కొన్నాను-"

"నీ జీవితాన్ని నాశనం చెయ్యాలను కొన్నానా నేను...? ఎంత మాటన్నావు లతా...?"

"నేనేం తప్పనలేదు బావగారూ...!" -లత గొంతు అదోలా పలికింది-"మీరు మనసులో పదిలంగా దాచుకొన్న భయం కరమైన రహస్యం నాకు తెలుసు. ఈ రహస్యం ఇట్లాగే దాచి...నా బ్రతుకు బండలుచేద్దా మనుకొన్నారా...?

"మీకు బ్లడ్ కాన్సర్..!డాక్టర్ చెపు తుండగా నేనూ విన్నాను. ఇంత పెద్ద రహస్యం దాచి...నన్ను పొందాలను కోకండి. ఇకనైనా అలాటి వెర్రి ఆశను ...వదనాడండి-"

"వస్తాను" చరచరా నడుస్తూ ముందు కెళ్ళిపోయింది లత.

* * *

కాన్సర్...! మానవుని పాలిటి మహా భూతం...కాన్సర్...!! ఎదురులేని మనిషి ప్రయత్నాన్ని వమ్ముచేసి... ప్రకృతికి విజయం చేకూర్చే...దోహద కారి...కాన్సర్...

పాతికేళ్ల వయస్సులోనే తాను... సంఘంలో మంచి హోదా...అంతస్తూ సంపాదించు కొన్నాడు. తనకి అంతులేని డబ్బుంది...అందముంది. అనుభవించే వయసుంది.

కాని...ఆరోగ్యం లేదు...!

ఆరోగ్యమే...మనిషికి అన్ని అర్హ తలూ...కొనితెస్తుంది.

తను జీవించేది యింకా ఎంత కాలమో తెలుసు.రోజురోజుకి...తను మృత్యువుకి చేరువగా...!

* * *



గతాన్ని విడిచి ఒక్కసారి..వాస్తవం లోకి వచ్చాడు రాజారావు. గతం స్ఫురణకు తెచ్చుకోవటం వల్ల... అతనిలో ద్వేషం మరింత బలపడింది.

'లత...! అందమైన లత. తను ప్రాణానికి ప్రాణంగా ఆరాధించిన మరదలు...లత...!!

'తన ప్రేమను గడ్డిపరకకన్నా... తేలిగ్గా తీసిపారేసి..తనంటే విపరీతంగా అసహ్యపడే లత...ఇంక ఎవ్వరికీ దక్కటానికి వీల్లేదు.

ఆ అందం తనది కాదు. ఇంక మరెవ్వరిదీ కాకూడదు. ఆ అందాన్ని లోకాతీతం చేస్తే...??

అందుకు వొక్కటే మార్గం. అదే హత్య...!!

హత్య...అవును...లతని హత్య చెయ్యాలి.

రాజారావులో దృఢమైన నిశ్చయం!

టైము పదిన్నర దాటింది.

ఇంతలో స్కూటర్ చప్పుడైంది. తలెత్తి చూసాడు.

సుకుమార్‌కు 'గుడ్‌నైట్' చెప్పేసి, గేటు తెరుచుకొని...లోపలకు వస్తోంది లత.

అతని హృదయం...ఏదో తెలియని

ఉద్వేగంతో స్పందించింది.నుదుట పట్టిన చెమటని ఆత్రుతగా తుడిచేసుకొన్నాడు.

*  *  *

ఏదో పెద్ద చప్పుడు వినిపించి... గాఢనిద్రలోవున్న లత ఉలిక్కిపడి లేచి కూర్చొంది.

ఏమిటా చప్పుడు...? ఎక్కన్నుంచి వచ్చింది..?ఏదో పిస్తోలు పేల్చినట్లుగా..

ఆమెలో ఏదో ఆదుర్దా..గగుర్పాటు.

ఒక్క ఉదుటున తలుపు తెరుచుకొని బయటకొచ్చింది.

తెల్లవారబోతున్నా..యింకా పూర్తిగా వెలుగురేకలు విచ్చుకోలేదు.

అప్పటికే లత తల్లి సరస్వతి... ఇంట్లో నౌకర్లు...అంతా కంగారుగా, ఆత్రుతగా రాజారావు గది ముందు నిలబడ్డారు.

"బాబూ...రాజా...!ఏంచేస్తున్నావు తలుపులు మూసుకొని లోపల? త్వరగా తియ్యి నాయనా తలుపు..."అరుస్తోంది-తలుపులు దబదబ బాదుతూ సరస్వతమ్మ.

హడలిపోయింది లత.

రాజారావు ఏదైనా అఘాయిత్యం చెయ్యలేదు కదా...! ఒక్క పరుగులో వెళ్ళింది తలుపు దగ్గరకు.

పిల్చింది తనూ..రకరకాల స్వరాల్తో.

ఎవరెంత పిల్చినా...లోపల్నుంచి ఎలాంటి అలికిడీ లేదు.

అందర్లోనూ...ఏదో అనుమానం... ఆదుర్దా.

ఇందాకటి పిస్తోలు చప్పుడికి అర్థాలు వెతుక్కొంది లత.తలుపులు పగిలాయి. గదిలో దృశ్యం లత చైతన్యంమీద... ...బాహ్యస్మృతిమీద.... దెబ్బతీసింది.

ఎదురుగా...రక్తపు మడుగులో... అచేతనంగా...రాజారావు. ఒకప్పటి... లత అందమైన బావ.

సరస్వతమ్మకి...పాతికేళ్ళ యోగ్యుడైన అల్లుడు

నౌకర్లకి...సహృదయుడైన యజమాని.

విధికి తన చేతిలో అపహాసించబడిన మనిషి...!


ఈ పరిణామం లత పూర్తిగా వూహించనిది. ఇది ఆమె నవనాడుల్ని కృంగదీసింది. తల్లి...నౌకర్లు ఘొల్లుమంటుంటే...లయ తప్పిన గుండెతో నిలబడిపోయింది.

ఈ లోకం పొలిమేరల్ని దాటేసిన బావగార్ని చూస్తుంటే ఆమెకి ఉప్పెనలా దుఃఖం పొంగిరావటం లేదు. మనసులో తనకి తెలియని ఏదో...శూన్యత.

టేబుల్ మీద...గాలికి కొట్టుకుపోకుండా ఎత్తుపెట్టిన ఏదో కాగితం... చిరుగాలికి రెపరెపలాడుతూ...!

ఆమె విచలితంగా...దాన్నందుకొంది-

"లతా...!



ప్రపంచంలో కొందరికి పరిస్థితులు.. ఎండమావుల్ని గుర్తు చేస్తే...నాకు మాత్రం జీవితమే ఎండమావి అయింది.

అందర్లాగే...ఈ లోకంలోకి ఆనందంగా ప్రవేశించాను. కాని...అనుకొన్న విధంగా కాకుండా మరోలా ముగిసిపోతున్నాను.

నిన్ను ప్రేమించాను..ప్రాణాధికంగా.

నా గుండె అనుక్షణం ఆర్తిగా... నిన్ను చూసుకొని.... నిన్ను అర్ధాంగిగా ఊహించుకొని, సంబరపడేది.

మన మధ్య ఎన్నో సమావేశాలు... అనుభూతులు...!

పెళ్ళికోసం తాపత్రయపడే సమయంలో...నాకు కాన్సర్ అని తెలిసింది. నేనింకా ఏడాదికంటే బ్రతకనని తెలీటంతో...గత్యంతరం లేక నిర్లిప్తతని ఆశ్రయించుకొన్నాను.

ఈ సమయంలో హఠాత్తుగా...నువ్వు సుకుమార్‌తో తిరగటం నన్ను విపరీతంగా అసహ్యయించుకోవటం... మొదలు పెట్టావు.

నా ఉనికే నచ్చనట్లుగా వుండే నీ ప్రవర్తన నన్ను విలవిల్లాడేలా చేసింది.

నాకు కాన్సర్ వున్న నిజాన్ని దాచి...నీ జీవితాన్ని...అర్థంతం చేస్తాననుకొన్నావు కదూ లతా...!

బ్రతుకులతో ఆడుకునేంత స్వార్థపరుణ్ణి కాదు.

నీకా నిజాన్ని చెబుదామనుకొన్నాను కాని అప్పటికే నీ కది తెలిసిపోయింది.ఆ సంగతి నాకా రోజు బీచిలో నీ మాటలవల్లే తెలిసింది.

అక్కడికి నిన్నాహ్వానించింది సుకుమార్‌తో నీ పెళ్ళివిషయం సంప్రదించాలనే...!

కాని మొదట్లోనే నన్ను అపార్థం చేసుకొన్నావు.

ఆ రోజు నీ మాటలు...నా మీద ప్రదర్శించిన ఏహ్యత...ఓహ్...! మాటల్లో నా బాధను వ్యక్తంచేయలేను లతా...!

నీ ప్రేమను పొందే అర్హత లేదు నాకు. అంత మాత్రాన...ఏదో పురుగును విదిలించినట్లుగా...!

నిన్ను మొట్టమొదట సారిగా ద్వేషించక తప్పలేదు నాకు. ఆ నా ద్వేషం ఎంతవరకెళ్ళిందంటే-నీ మీద కక్ష సాధించాలనుకొన్నాను.

-ఫలితంగా నీ పైన నా హత్యా ప్రయత్నం...! ఆశ్చర్యపోతున్నావా లతా...! నిన్ను చంపాలనుకొన్నాను.

రాత్రి నీ గదిలో ప్రవేశించాను. పడక మీద ప్రశాంతమైన నిద్రలో... నువ్వు...!

ఒక హృదయం రగలడానికి సమిధలు పేర్చిన నువ్వు...అంత నిశ్చింతగా నిద్ర పోతుంటే...సహించలేకపోయాను ...చూసి భరించలేకపోయాను.

నీ మంచం సమీపించాను.

కాని...కాని...నిన్నంతం చెయ్యలేక పోయాను.

నాలో...శక్తి...అశక్తి అక్కడే దెబ్బలాడినయ్.

చివరి క్షణంలో...అశక్తికే విజయం లభించింది.

నీ హృదయం పాషాణం కావచ్చు. అయినా నిద్రలో నీ ముఖం...అమాయికంగా నా చైతన్యంమీద దెబ్బ తీసింది.

నాలో ద్వేషం ఎటు మాయమైందో తెలియదు

ఆ రాత్రి...ఆఖరి సారిగా, సున్నితమైన నీ చేయిని నా పెదాలకి చేర్చుకొన్నాను.

తనివితీరా... నీ ముఖాన్ని...నాలో ప్రతిష్ఠించుకొని బయటకొచ్చాను

లతా...! ఆఖరిగా...నాదో చిన్న అభ్యర్థన. నా ఆస్తి నీ పేర రాసి పోతున్నాను. సుకుమార్‌ని వివాహమాడి హాయిగా జీవించు.

నా సూయిసైడ్ నాకు నేనుగా చేసుకొన్నదే. ఈ విషయం తెల్పే...పోలీస్ డిపార్టు మెంట్‌కి రాసిన స్లిప్ టేబుల్ మీద వుంది.

మరో జన్మంటూ వుంటే—విధి పరిహసించని అర్హతగల వ్యక్తిగా జన్మించాలని కోరుకొంటూ

—రాజా"

కాగితాలు జారిపోయాయి లత చేతిలోంచి. దృష్టి తిప్పి...రాజారావుని చూసింది.

ఆత్రిగా వొంగి...అతని మొహానికి దగ్గిరగా.. తన ముఖాన్ని చేర్చింది.

అంతే..! ఆమె కుప్పలా కూలిపోయింది.